క్లుప్తంగా

జగన్నాథ రథయాత్రలకు సర్వం సిద్ధం



సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వామివారు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథుని ఆలయం రథయాత్ర ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ప్రతి ఏటా పూరీలో వలె ఈ ఆలయంలో రథోత్సవాలను దేవస్థానం అట్టహాసంగా నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఉత్సవాలను ఈనెల 7 నుంచి 17 వరకు జరుపనున్నారు. ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి స్వామివారి రథయాత్ర ఆలయం నుంచి ద్వారకాతిరుమల క్షేత్రం వరకు జరుగుతుందని దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాధరావు తెలిపారు.

స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు



రహదారి పనులను పరిశీలిస్తున్న ఉప సర్పంచ్ శ్రీనివాసరావు

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురంలో సాయిబాబా గుడికి వెళ్లే రహదారిని స్థానికులు, వైఎస్సార్ సీపీ నేతలు స్వచ్ఛందంగా మరమ్మతులు చేయించారు. గత కొంతకాలంగా ఈ రహదారి గోతులమయంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో స్థానికులు, రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు పోల్నాటి రాజా, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రావెల్ పర్చి రహదారిని బాగుచేయించారు.

శ్రీవారి సేవలో...



ఎంపీ పురంధేశ్వరికి, ఎమ్మెల్యే మద్దిపాటికి శ్రీవారి మొమెంటోను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి దంపతులు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శనివారం సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి స్వామివారి శేష వస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఈఓ త్రినాధరావు శ్రీవారి మొమెంటోలు, ప్రసాదాలను అందజేశారు.

సాగునీటి బోదె ఆక్రమణ



భీముడి చెరువు సాగునీటి కాలువ నీటిపారుదల లేకుండా అడ్డుకట్ట వేసిన దృశ్యం

కొయ్యలగూడెం: భీముడి చెరువు నుంచి సాగు పొలాలకు నీరు అందించే పంట కాలువ బోదె ఆక్రమణకు గురయ్యిందని ఆయకట్టు రైతులు శనివారం ఆందోళన నిర్వహించారు. చెరువు కళింగ నుంచి సాగు భూములకు నీరు అందించే కాలువను కొంతమంది వ్యక్తులు ఆక్రమించి తమ పొలంలో కలుపుకున్నారని ఆరోపించారు. దీంతో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా నీరు అందడం లేదన్నారు. గత సంవత్సరం కూడా ఇదే విధంగా కాలువ బోదె ఆక్రమణకు గురవ్వగా అధికారులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించి ఆక్రమణలను తొలగించి నీటి కాలువ సరఫరాను పునరుద్ధరించారన్నారు. ప్రభుత్వం మారిన పిదప మళ్లీ ఆక్రమణ చేశారన్నారు. వ్యవసాయ ఊడ్పులు ముమ్మరంగా ప్రారంభం అయ్యాయని ఈ సమయంలో నీరు నిలిచిపోవడం తమకు నష్టం కలిగిస్తుందని రైతులు వాపోయారు. దీనిపై పీడబ్ల్యూడీ ఏఈ భాస్కరరావు దృష్టికి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

అంకాలగూడెంలో ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కొయ్యలగూడెం: బోడిగూడెం పంచాయతీ అంకాలగూడెం పాత దళితవాడలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని గ్రామస్తులు శనివారం ఆందోళన నిర్వహించారు. ఇక్కడ అంగన్‌వాడీ భవనానికి స్థానికులు గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం చేపట్టారు. 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఈలోగా ప్రభుత్వం మారడంతో అసంపూర్తిగా నిలిచిపోయింది. అంగన్‌వాడీ సేవలు అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వీరి ఆందోళనకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కె.రాజారత్నం సంఘీభావం తెలిపారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు ఆదర్శప్రాయం



కామవరపుకోట: తాడిచెర్లలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

లింగపాలెం: బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి కృషి చేసిన భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం ధర్మాజీగూడెంలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ధర్మాజీగూడెం కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే రోషన్ కుమార్, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెరువుగట్టు రామ్మోహనరావు, వేంపాటి ప్రసాద్, పల్లి శ్రీను, పరసా రాజు, గజ్జా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట: మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలను తాడిచర్ల గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త, రాజకీయ వేత్తగా బాబూజీ ప్రసిద్ధుడన్నారు. అయన అందించిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారథి, గ్రామ కమిటీ అధ్యక్షుడు వేముల హనుమంతు, కొప్పుల జయరాజు, కుటుంబరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏలూరు రోడ్డులోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు కె.వి గ్నేష్ శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, రాజకీయవేత్తగా దేశానికి జగ్జీవన్‌రామ్ ఎన్నో సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కొత్తూరి నాగేశ్వరావు, బొక్క శ్రీనివాస్, కొత్తూరి ఏమిలేసు, యడ్లపల్లి ప్రసాద్, అల్లే శ్రీను, డోల రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి

కొయ్యలగూడెం: స్వాతంత్ర్య సమరయోధుడిగా, సామాజిక విప్లవ సంస్కర్తగా దివంగత ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్‌రామ్ కృషి చేశారని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. కొయ్యలగూడెం, కన్నాపురం గ్రామాలలో శనివారం భారతరత్న బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాలు ఆయన అభిమాన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. సామాజిక సమానత్వం కోసం అహర్నిశలు బాబు జగ్జీవన్‌రామ్ శ్రమించారని యువజన సేవా సంఘ అధ్యక్షుడు బొబ్బర చిట్టిబాబు పేర్కొన్నారు. కన్నాపురంలోని జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంఆర్‌పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముప్పిడి కనిష్ట సంఘ వెంకటేష్, పూలపల్లి రవికుమార్, పెనుమాకుల వెంకటేష్, తమ్మిర్చి వెంకటేష్, పాతకాకుల శ్రీను, బొబ్బర రాము, కొడమంచిలి రవి తదితరులు పాల్గొన్నారు.



లింగపాలెం: ధర్మాజీగూడెంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్, నేతలు



కొయ్యలగూడెం: బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పశు సంక్రమిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



జంగారెడ్డిగూడెంలో పెంపుడు కుక్కలకు రేబిస్ టీకా వేస్తున్న వైద్యులు

చింతలపూడి: పశు సంక్రమిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా జొన్నలగడ్డ లింగయ్య సూచించారు. ప్రపంచ పశు సంక్రమిక వ్యాధుల నివారణా (జూనోసిస్)దినోత్సవం సందర్భంగా శనివారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన చుట్టూ మనతో పాటు నివసించే పశు, పక్ష్యాదులు, జంతువుల వల్ల పలు ప్రమాదకర వ్యాధులు పొంచి ఉన్నాయని, ఇందులో ప్రాణాంతక వ్యధుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. పెంపుడు కుక్కలను, జంతువులను ఇంట్లో తిరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాలు, మాంసం, గ్రుడ్లు, చేపలు తగిన ఉష్ణోగ్రత వద్ద ఉడికించాలని సూచించారు. పశు పోషకులు వాటి మల, మూత్రాలను ఎప్పటికప్పుడు నిల్వ లేకుండా శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ప్రపంచ పశుసంక్రమిత వ్యాధుల దినోత్సవం జంగారెడ్డిగూడెంలో పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం ప్రాంతీయ పశువైద్యాశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పీఎస్‌వీ శేఖర్‌దొర మాట్లాడుతూ పశు సంక్రమిత వ్యాధులు సుమారు 280 ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. రేబిస్ వ్యాధి ప్రమాదకరమైనది, కుక్కలకు తప్పనిసరిగా రేబిస్ వ్యాధి టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సుమారు 45 పెంపుడు శునకాలకు రేబిస్ నివారణ వ్యాధి టీకాలు వేశారు. లక్కవరం పశువైద్యాధికారి భీమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: పశువైద్యశాలలో ప్రపంచ జూనోటిక్ వ్యాధుల దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ జూనోటిక్ వ్యాధుల గురించి, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా పశువులకు ఉచిత టీకాలు వేశారు. మొత్తం 122 పెంపుడు కుక్కలకు, 9 పిల్లులకు టీకాలు వేశారు. పశువైద్య సహాయకురాలు పి.వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్, సత్యవతి, పశుసంవర్ధక సహాయకులు 14 సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఎస్.రమేష్ సూచించారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జి.కొత్తపల్లి పశువైద్యశాలలో శనివారం 60 శునకాలకు ఆయన యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కల యజమానులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శునకాలకు టీకాలు వేయిస్తే అవి కరిచినా, మనుషులకు రేబిస్ వ్యాధి సోకదన్నారు. జంతువులు కరవడం వల్ల సంక్రమించే వ్యాధుల గూర్చి జంతు ప్రేమికులు క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు.



చింతలపూడిలో పశువుల ఆసుపత్రి వద్ద పెంపుడు కుక్కకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న డా లింగయ్య



కొయ్యలగూడెం పశు వైద్యశాలలో జునోటిక్ వ్యాధుల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో పెంపుడు శునకానికి టీకా వేస్తున్న వైద్యుడు రమేష్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

కామవరపుకోట: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అన్నారు. ప్రపంచ పర్యావరణం పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి తన మాతృమూర్తి పేరు మీదుగా ఒక మొక్కను నాటి పర్యావరణం పరిరక్షణలో భాగస్వాములు కావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.రామ్మోహన్, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, వి.శ్రీనివాస్, ధారావతు మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నీట్ పరీక్ష-2024ను రద్దు చేయాలని డిమాండ్



పోలవరంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

పోలవరం రూరల్: నీట్ పరీక్ష-2024ను రద్దు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గం పిలుపులో భాగంగా పోలవరం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రధాన సెంటర్ ఏటిగట్టు వరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు బన్నె వినోద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్పందించి బాధ్యతారాహిత్యంగా నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ను, నీట్ పరీక్షను-2024ను రద్దు చేయాలని, పేపర్ లీకేజ్‌పై సమగ్ర న్యాయ విచారణ జరపాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, పేపర్ లీకేజ్ లను అరికట్టాలని, నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు షేక్ అమీర్, కొయ్య సంతోష్, కుంజం అమర్నాథ్, గోరా షేక్ ఆసిఫ్, మేడుం గణేష్, వారా మంజుల, యంగల శిరీష, బచ్చల రాజేశ్వరి, బిక్కవోలు విజయదుర్గ, వారా సంజన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల అందజేత



విద్యార్థినికి నగదు ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న డాక్టర్ టి.వెంకటేశ్వరరావు

పోలవరం రూరల్: పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం పూర్వ విద్యార్థి, డాక్టర్ టి.వెంకటేశ్వరరావు, ఉమావల్లీ దంపతులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ ఏడాది ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రథమ సాధించిన అడబాల నిర్మలకుమారి, పోతుల మనీషాలకు రూ. 8వేలు చొప్పున, రెండవ స్థానం సాధించిన గోదావరి పావనీకి రూ.6వేలు అందజేశారు. అలాగే 10వ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన పి.అనూషకు రూ.12వేలు. ద్వితీయ స్థానం సాధించిన కె.రేవతికి రూ. 8వేలు నగదు ప్రోత్సాహకాలను అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.సజిని, పాఠశాల పూర్వ విద్యార్థులు కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, ప్రక్కి రవి, కర్రి తిరుపతిరావు, శ్రీరామమూర్తి, కోటంరాజు రాంబాబు, నాళం గాంధీ, సోమరౌతు వెంకటేశ్వరరావు, నోరి సోమయాజులు, చిలకా రాంబాబు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పుష్పాలు వేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

పోలవరం రూరల్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతిని పోలవరంలో బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్రపటానికి పుష్పాలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కరిబండి నాగరాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొరగం వెంకట లక్ష్మి, మండల అధ్యక్షుడు కామిశెట్టి నాగరాజు, కక్కిరాల ప్రభాత్, తెల్లం విష్ణు, ముంజేటి ప్రభుతేజ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు



ధర్మాజీగూడెం రామకృష్ణ మెన్యూర్ డిపోలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

లింగపాలెం: ధర్మాజీగూడెంలో పురుగుమందులు, ఎరువులు, విత్తనాల దుకాణాలను శనివారం స్టేట్ విజిలెన్స్ టీమ్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రామకృష్ణ మెన్యూర్ డిపో, శ్రీసాయి శివ సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, లక్ష్మి ట్రేడర్స్ దుకాణాలను విజిలెన్స్ ఏడీఏ జగదీశ్వరరెడ్డి, సీఐ నాగవెంకటరాజు తనిఖీ చేశారు. దుకాణాల్లో విత్తనాలకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు, లేని 40356 విలువైన పురుగుమందులను, రూ.12,37,249 విలువైన ఎరువులు ఉన్నట్లు గుర్తించి వాటి విక్రయాలను నిలుపుదల చేసినట్లు చింతలపూడి వ్యవసాయశాఖ ఏడీఏ నాగకుమార్, లింగపాలెం ఏవో మురళీకృష్ణ తెలిపారు. షాపుల్లో నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయాలు చేస్తే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

చింతలపూడి: మండలంలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాలపై వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు శనివారం సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని రూ.8,56,564 విలువైన పురుగు మందులు, రూ.5,08,050 విలువైన వరి విత్తనాలను గుర్తించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు పట్టుబడ్డ పురుగుమందులు, వరి విత్తనాల విక్రయాలను నిలుపుదల చేసినట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. తనిఖీల్లో చింతలపూడి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి నాగకుమార్, ఏఓ కె మీనాకుమారి, టెక్నికల్ ఏఓ ప్రవీణ్ పాల్గొన్నారు.

పారిజాతగిరిలో పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగనివేదన, తోమాలసేవ, తీర్థప్రదాగోష్టి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించి అష్టోత్తర పూజలు జరిపించుకున్నారు. స్వామి వారికి కానుకలు, మొక్కుబడులు, ముడుపులు చెల్లించుకున్నారు. దాతలు యాదిగాని ఎలియజర్ జయ, ధనలక్ష్మి దంపతులు, కంఠమని ఆమోద భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం దాతలను ఆలయ అర్చకులు నల్లూరి రవి కుమార్ ఆచార్యులు స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదాలతో సన్మానించారు. ఆలయ కార్యనిర్వాణాధికారి మానికల రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఏటిగట్టు పటిష్టతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

పోలవరం రూరల్: వరదను ఎదుర్కొనేందుకుగా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై మండల స్థాయి అధికారులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం తహసిల్దార్ జీవీఎస్ ప్రసాద్ సమావేశం నిర్వహించారు. వర్షాల సీజన్ ప్రారంభమైనందున అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. వరదలు, వర్షాల వల్ల ఏ విధమైన ప్రాణ నష్టం జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఏటిగట్టు ప్రాంతం పటిష్టతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్థానికంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయడం జరుగుతుందని ఎప్పటికప్పుడు అధికారులతో పరిస్థితులపై తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, ఎంపీడీవో జి.శ్రీను, ఎస్సై ఎస్ఎస్‌పవన్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

9న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ద్వారకాతిరుమల: ఈనెల 9న మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తిరుపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చింతలపూడి: చింతలపూడి పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సమ్మెటవారిగూడెం గ్రామానికి చెందిన పట్నాల నాగ వెంకట సత్యన్నారాయణ ద్విచక్ర వాహనంపై ఫాతిమాపురం వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన సత్యన్నారాయణను పోలీసులు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఏలూరు తరలించినట్లు తెలిపారు. ఎస్సై కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ఆక్రమణదారులకు నోటీసులు

చింతలపూడి: చింతలపూడి పట్టణంలో రోడ్డు ఆక్రమణలను తొలగించే పనులను అధికారులు చేపట్టారు. ఇందులో భాగంగా ఎస్సై కుటుంబరావు ఆధ్వర్యంలో రోడ్లు భవనాల శాఖ అధికారులు శనివారం మెయిన్ రోడ్డును ఆక్రమించుకున్న ఆక్రమణదారులను స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. వారికి నోటీసులు జారీ చేశారు. అలాగే డ్రెయినేజీ మీద ఆక్రమణలను తొలగించాలన్నారు. ఆక్రమణలు తొలగించని పక్షంలో జేసీబీలతో తొలగిస్తామని ఆక్రమణదారులను హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.

పీఏసీఎస్‌లో అవకతవకలపై విచారణ

టి.నరసాపురం: ఉద్యోగులు అవకతవకలకు పాల్పడ్డారనే అభియోగంపై శనివారం టి.నరసాపురం పీఏసీఎస్‌లో విచారణ నిర్వహించారు. విచారణ అధికారి అల్లంశెట్టి శాంతకుమారి ఖాతాదారులు, రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీసీసీబీకి అందిన ఫిర్యాదులపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ నిర్వహించినట్లు చెప్పారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆమె తెలిపారు. ఖాతాదారులకు సత్వరమే న్యాయం చేయాలని కోరుతూ విచారణ అధికారి శాంత కుమారికి జనసేన మండల గ్రామ పంచాయతీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలేటి సత్యనారాయణ వినతి పత్రం అందజేశారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పోలవరం డివిజన్

90102 23729

99122 20559

95055 08399 (చింతలపూడి)

Office mail : tpgadvt@gmail.com